

# రుధిర సంగ్రామం

**– పొత్తూరు రాజేంద్ర ప్రసాద్‌వర్మ**



*వాస్తవంగా జరిగిన పద్మనాభ యుద్ధంలో సంఘటనలు, చారిత్రక అంశాలను క్రోడీకరించి ఆనాటి రాజకీయ సాంఘిక నేపథ్యాలను ఆధారంగా చేసుకుని సంఘటనలను అల్లుకుని రాసిన చారిత్రక నవల. వ్యక్తులు ప్రదేశాలు సన్నివేశాలను కథారూపంలో తయారు చేయడం జరిగింది. యుద్ధం జరగడం వెనుక కారణాలను వివరించడానికి కథారూపంలో విస్తరించడం వల్ల పాఠకులు సులభంగా చదువుకోవడమే కాకుండా చరిత్రలో మరుగున పడిపోతున్న క్షత్రియుల పోరాట పటిమకు, పౌరుషానికి, బ్రిటిష్‌వారి సార్వభౌమత్వాన్ని ధిక్కరించి, ఎదిరించి నిలిచి వీరోచితపోరాటం చేసినవారి స్ఫూర్తిని తెలియజేయడానికి నవలారూపంలో రాసిన చారిత్రక సంఘటనల మాలిక ఈ రుధిర సంగ్రామం.*

*పరాయిపాలకుల దాస్య శృంఖలాలను తెంచుకోవాలని ప్రాణాలొడ్డి పోరాటాలు చేసిన ఎంతోమంది వీరులు ఉత్తరాంధ్ర జిల్లాలో ఉన్నారు. బ్రిటిష్‌వారి దాష్టీకాలను ఎదుర్కోవడానికి వీరోచితమైన యుద్ధం చేసి అసువులు బాసిన ఎంతోమంది వీరాధివీరుల్లో చిన విజయరామరాజు ఒకరు. విజయనగర సంస్థానానికి చెందిన ఈయన ఉత్తరాంధ్ర జిల్లాలో సామంతరాజుల్ని కూడగట్టుకుని బ్రిటిష్ వారిపై ఆ794లో చేసిన పోరాటం స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ యుద్ధంలో ఎంతోమంది బ్రిటిష్‌వారు చనిపోయారు. బ్రిటిష్ సైనికులు తుపాకులతో చేసిన పోరాటానికి వీరావేశంతో వచ్చిన వీరాధివీరులైన రాజుల చేతిలో చిక్కి విగతజీవులయ్యారు. తెలుగుజాతి ఆత్మాభిమానాన్ని నిలబెట్టడానికి, తెలుగుతేజాన్ని నిరూపించడానికి, బానిసబతుకుల్ని ఎదిరించాలన్న రాజుల పౌరుషాన్ని చూపించడానికి. పరాయి పాలకుల పీడను విరగడ చేయడానికి తెలుగువారి దాస్యశృంఖలాలు తొలగించడానికి చేసిన పోరాటం పద్మనాభయుద్ధంగా చరిత్రలో నిలిచిపోయింది.*

*భారతదేశంలో ఎన్నో ప్రాంతాల్లో ఎంతోమంది వీరులు పోరాటాలు చేశారు. ఈ దేశం మాది మీరు మీ దేశం పొండని తిరుగుబాట్లకు పాల్పడ్డారు. బ్రిటిష్‌వారిని ఎదిరించి దేశభక్తులుగా నిలిచారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది స్వాతంత్ర సమరయోధుల వీరగాథలు చరిత్రలో నిక్షిప్తం అయ్యాయి. అయితే విజయనగర రాజులు వీరోచిత పోరాట చరిత్ర పద్మనాభ యుద్ధానికి ఉంది. ఇతర ప్రాంతాలలో జరిగిన పోరాటాలతో పోలిస్తే విభిన్నమైన ఈ యుద్ధ చరిత్ర దాని నేపధ్యం చాలావరకు అజ్ఞాతంగానే ఉండిపోయింది. విశాఖ మాన్యుయేల్‌లో లార్డు కార్మికేల్ మాత్రం ఈ యుద్ధంలో చనిపోయిన వీరుల వివరాలను నిక్షిప్తం చేశారు. ఈ పద్మనాభ యుద్ధాన్ని స్కాట్లాండులో జరిగిన లాడెన్ సంఘటనతో చరిత్రకారులు పోలుస్తుంటారు. 1794లో జరిగిన ఈ యుద్ధం దాని చారిత్రక నేపథ్యంతో రాసిన నవల.*

*(గతసంచికతరువాయి)*

**ఉదయం ఆరుగంటలు**

విజయరామరాజు పద్మనాభంలో అనంత పద్మనాభస్వామి దేవాలయాన్ని సందర్శించాడు. ఆ దేవాలయం విజయనగరం రాజుల పోషణలో ఉండటం వల్ల ఆలయ అర్చకులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

"స్వామీ నిన్ను నమ్ముకుని పోరాటంలో దిగుతున్నాను. చేయని తప్పుకు బ్రిటిష్‌వారు బాధ్యులుగా చేసి పేష్కను బకాయిలను సాకుగా చూపించి ఇతర ప్రాంతాలకు పంపించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. నీ సమక్షంలో ఉండాలని ఉంది. సంగ్రామం జరగకుండా నా ఆలోచనలు ఇతర అంశాలు బ్రిటిష్ కంపెనీ అధికారులు అంగీకరించేలా చూడు. స్వామీ ఒకవేళ వారి మనసుల్లో మార్పురాకపోతే పద్మనాభంలో జరగనున్న పోరాటంలో నాకు విజయాన్ని ప్రసాదించు. ఓడిపోయానన్న అపకీర్తి నాకు కలిగించకు స్వామీ. అవసరమైతే నీ సమక్షంలో ప్రాణత్యాగం చేసుకుని వీర మరణం పొందుతాను. దయ చూడు స్వామీ" విజయరామరాజు మనసులో ప్రార్థించాడు.

విజయరామరాజు వెంట వచ్చినవారు కూడా దేముడికి దణ్ణం పెట్టుకున్నారు.

పూజారి అందరికీ ప్రసాదాలను అందించాడు.

తర్వాత తనకు సన్నిహితంగా మెలిగే పూసపాటి విజయగోపాలరాజుని పిలిచి "గోపాలంగారూ మీరో సాయం చేయాలి" విజయరామరాజు అడిగాడు.

విజయరామరాజుకు కాస్త దూరంగా నడుస్తున్న విజయగోపాలరాజు దగ్గరగా వచ్చి "చెప్పండి ప్రభూ తమరు ఆదేశించాలి" అన్నాడు. అతను వయసులో విజయరామరాజు కన్నా పెద్దవాడు అయినప్పటికీ ఎంతో వినయంగా ఉంటాడు.

"బ్రిటిష్ అధికారుల నుంచి స్పందన కనిపించడంలేదు యుద్ధం అనివార్యం అనిపిస్తోంది. అన్నమరాజు పేటలో ఉన్న కుటుంబాన్ని దూరంగా పంపించాలి"

మొదట విజయగోపాలరాజుకు విషయం అర్థంకాలేదు.

విజయరామరాజు అత్తగారి ఊరు పద్మనాభానికి ఆరుకిలోమీటర్ల దూరంలో ఉన్న అన్నమరాజుపేట అని తెలుసు. అతని భార్య సీతయ్యమ్మ, కుమారుడు నారాయణ గజపతి రాజు అక్కడే ఉంటున్న విషయం తెలుసు. వారి గురించి రాజుగారు మాట్లాడుతున్నారని గ్రహించి "మహారాజా వారి గురించి మీకు దిగులు అవసరంలేదు. యుద్ధంలో మనం విజయం సాధిస్తాం ఆ విజయంలో వారు కూడా ఆనందాన్ని పొందుతారు" అన్నాడు.

"నేను చెప్పిన సంగతి చూస్తారా?"

విజయరామరాజు చెప్పిన విషయాన్ని తూచా తప్పకుండా ఆచరించే వ్యక్తి ఆయన చెప్పిన విషయాన్ని తాను తప్పకుండా ఆచరించాలి అంతే అనుకున్నాడు విజయగోపాలరాజు. తర్వాత దగ్గరగా వచ్చి "చిత్తం మహారాజా తమరు చెప్పిన విధంగా చేద్దాం. ఉన్నపళంగా వారిని ఎక్కడికి పంపించగలం?" భయంభయంగా అడిగాడు.

రెండు నిమిషాలు విజయరామరాజు ఏమీ మాట్లాడలేదు. జంపన వారి కుటుంబానికి చెంది అన్నమరాజుపేటలో ఉంటున్న భార్యాబిడ్డల్ని ఎక్కడికి పంపించాలో ఆయనకు అర్థంకాలేదు. తర్వాత నెమ్మదిగ మన సంస్థానాన్ని అభిమానించేవారు ఏజన్సీ సరిహద్దులో ఉన్న కాశీపురంలో ఉన్నారు వారి దగ్గరికి పంపిద్దాం. వారిని తీసుకుని వెళ్ళే ప్రయాణ ఏర్పాట్లు మీరు చూడండి. కాశీపురంలో వారు వారి సహాయకులు ఉండవలసిన సంగతి వేరే వ్యక్తులు చూస్తారు" మరో మాటకు అవకాశం లేకుండా ముందుకు సాగిపోయారు.

పద్మనాభం దేవాలయం ఎదురుగా గోస్తనీ నది ప్రవహిస్తోంది. నది తీరంలో విశాలమైన ఇసుక తిన్నెలు ఆవరించి ఉన్నాయి. ఇసుక మధ్య నుంచి మద్ది గ్రామ మలుపు తిరిగి నది నాగుపాములా ప్రవహిస్తోంది. ఆ పరిసరాలను వాతావరణాన్ని చూస్తూ ఉండిపోయాడు.

పక్కన పద్మనాభస్వామి కొలువైన ఎత్తయిన కొండ, వాటిని ఆవరించి ఉన్న చిన్న మొక్కలు ఆ ప్రాంతాన్ని అంత జాగ్రత్తగా ఇదివరకు ఆయన చూడలేదు. వాటిని చూస్తుంటే మనసంతా ఏదో దిగులు కమ్మేసినట్లుగా అయిపోయింది. విజయనగరం కోట ఆక్రమణకు గురైంది. తాను రాజ్యాధికారానికి దూరంగా కుటుంబానికి దూరంగా ఉండవలసిన పరిస్థితులు వచ్చాయి. వీటిని కల్పించిన బ్రిటిష్ అధికారులపై ఒక్కసారి కోపం ఎగజిమ్మింది. భారతదేశంలో ఇప్పుడిప్పుడే సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్న ఈస్టు ఇండియా కంపెనీ అధికారులు సంస్థానాలను చిన్న రాజ్యాలను కబళించడానికి చేస్తున్న ప్రయత్నాలు వెగటు పుట్టిస్తున్నాయి.

ఈ ఆలోచనలో ఉండగానే వత్సవాయి నీలాద్రిరాజు దగ్గరగా వచ్చి "జరగబోయే యుద్ధం కోసం వివిధ ప్రాంతాలలో ఉన్న సామంత రాజులు, దివాణంగారిని అభిమానించే చిన్నరాజులు యుద్ధంలో ఆరితేరిన విలుకాడులు, మల్లయోధులు అంతా పద్మనాభం రావడానికి సిద్ధపడుతున్నారు. ఇప్పుడిప్పుడే వారికి పరిస్థితి అర్ధం అవుతోంది. విజయనగరం సంస్థానం కోసం ప్రాణాలు అర్పించడానికి కూడా వెనుకాడటంలేదు" అన్నాడు.

"ఎవరినీ బలవంతం చేయవద్దు." అంటూ దేవాలయం వద్ద సిద్దంగా ఉన్న గుర్రాల బగ్గీ ఎక్కగానే అది రాజుగారు విడిది చేసే ప్రాంతానికి చేరడానికి ముందుకు కదిలింది.

విజయరామరాజు వెనుక దేవాలయానికి విచ్చేసిన వారంతా దానిని అనుసరించారు

ఆరోజు సాయంత్రం.

అన్నం రాజు పేటలో ఉన్న విజయరామ రాజు భార్య సీతయ్యమ్మ ఏకైక కుమారుడు నారాయణ గజపతిరాజులను కొద్దిమంది అనుచరులను కాశీపురం తరలించారు. వారి వెనుక నలుగురు రక్షణ సిబ్బందిని కూడా తోడు పంపారు.

వారి ప్రయాణం జరగగానే విజయగోపాలరాజు పద్మనాభంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన విడిది గృహంలో ఉన్న విజయరామరాజుకు ఆ వివరాలను తెలియజేసాడు.

వివరాలు ఏమీ అడగకుండా "వారి వెంట ఎవరున్నారు?" ప్రశ్నించాడు.

"మన సంస్థానం ప్రతినిధి కాకర్లపూడి బాపిరాజు ఉన్నారు. ఆయన బహుజాగ్రత్త మనిషి. మనం కంగారు పడవలసిన అవసరం లేదు"

మహారాజు మనసులో అప్పటివరకు ఉన్న దిగులు కాస్త తగ్గింది.

పద్మనాభం చేరుకున్న యుద్ధవీరులు

యుద్ధం అనివార్యమని అందరికీ అర్ధం అయిపోయింది.

విజయనగరం సంస్థానం పరిధిలో ఉన్న వివిధ గ్రామాలలో ఉంటున్న క్షత్రియ వీరులు స్వచ్చందంగా పద్మనాభం చేరుకున్నారు. చిన్న సంస్థానాలు చెందినవారు తమ సైన్యంలో ఉన్న బలవంతులు, ధైర్యవంతుల్ని ఎంపిక చేసి యుద్ధరంగానికి పంపించాయి. కోటవురట్ల అనకాపల్లి కశింకోట ప్రాంతాలతో పాటు విజయనగరం పార్వతీపురం, గుమలక్ష్మీపురం, శ్రీకాకుళం జయపురం వంటి ప్రాంతాల నుంచి కూడా కొంతమంది సైనికులు విచ్చేసారు. అప్పటికే చంద్రగిరి సంస్థానం నుంచి పిఠాపురం ప్రాంతానికి వలస వచ్చిన పొత్తూరు కుటుంబాలకు చెందిన కొంతమంది మల్లయోధులు కూడా పద్మనాభం ప్రయాణమయ్యారు.

విజయరామరాజు కానీ ఆయన సన్నిహితులు కాని యుద్ధానికి సైనికుల్ని మనస్ఫూర్తిగా సమీకరించలేదు. తాను రాసిన ఉత్తరాలకు జవాబు వస్తుందని తన పట్ల బ్రిటిష్ సైనికులు సానుకూల దృక్పథంతో ఉంటారని ఆయన మనసులో ఎక్కడో నమ్మకం ఉంది. అందుకే తాను పిలిస్తే వందలాదిమందిగా వచ్చే క్షత్రియపుత్రులను మనస్ఫూర్తిగా పిలవలేదు.

విజయనగరానికి ఎంతో వెన్నుదన్నుగా ఉండే జయపురం సంస్థానం నుంచి ఒక్క సైనికుడు కూడా రాలేదు వారంతా విజయరామరాజు సంస్థానానికి సామంతరాజులుగా ఉన్నారు. కోటను బ్రిటిష్‌వారు స్వాధీనం చేసుకున్నారని తెలుసు యుద్ధానికి విజయరామరాజు సన్నద్ధులవుతున్నారని తెలుసు. ఎందువల్లో వారు నిర్లిప్తంగా ఉండిపోయారు. వారి విషయాలు తెలిసినప్పటికీ మహారాజు కూడా వారిపైన వత్తిడి తీసుకుని రాలేదు.

విజయరామరాజుకు మద్దతుగా పద్మనాభం చేరుకున్న రాజులకు వసతి ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి. వీటిని హాలాజు అనే మహారాజు అనుచరుడు స్వయంగా పర్యవేక్షించాడు. విజయనగరం నుంచి వచ్చే సైనికులకు రెడ్డిపల్లి సేరీఖండం ప్రాంతంలో గుడారాలను ఏర్పాటు చేసారు. సింహాచలం అనకాపల్లి ప్రాంతాలనుంచి వచ్చేవారికి గోస్తనీ నది ఆవలతీరంలో ఉన్న మద్ది కల్లాలు ప్రాంతాలలో గుడారాలను, వసతిని ఏర్పాటు చేసారు. రాజులు తమతో తెచ్చుకున్న కత్తులు కటారులు ఇతర సామాగ్రి కోసం గుడి సమీపంలో ఇసుకలపాలెం రహదారి పక్క ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. వీరందరికి వారం పదిరోజుల పాటు భోజనాలు ఇతర ఫలహారాల కోసం కూడా అన్ని సదుపాయాలను సమకూర్చారు.

యుద్ధం అనేది ప్రారంభం అయితే కొద్దిరోజులు కొనసాగుతుందని విజయరామరాజు వద్ద ఉన్న అనుయాయులకు తెలుసు. అందువల్ల రాజుతో సంబంధం లేకుండా అన్ని పనులను వారే దగ్గరుండి చేసారు. ఎవరికి ఎటువంటి సదుపాయాలు కలుగుతున్నాయన్న విషయం మాత్రం నిరంతరం మనసులో మెదులుతూనే ఉంది.

శత్రు సైనికులపై నలుమూలలనుంచి దాడి చేయాలని వారు ఆలోచించుకునే అవకాశం లేకుండా వారిపై తిరగబడాలని విజయరామరాజు వెనుక ఉన్న సామంతరాజుల వ్యూహంగా ఉంది. అందుకు అనుగుణంగానే వారు ప్రయత్నాలను ప్రారంభించారు అందరూ సమావేశమై యుద్ధానికి సమాయత్తం అయ్యారు.

విశాఖపట్నం నుంచి వచ్చిన బ్రిటిష్ సైన్యాలు బోని గ్రామం వద్ద ఉన్న విశాలమైన స్థలంలోకి చేరుకున్నాయి. అక్కడున్న మెట్ట ప్రాంతంలో వారు విడిది చేసారు. అక్కడ నుంచి చూస్తే గోస్తనీనది అవతల ఉన్న పద్మనాభం కొండ విజయనగరం సైన్యాల కదలికలు తెలుస్తుంటాయని వారు ఆ స్థలాన్ని ఎన్నుకున్నారు.

పద్మనాభంలో యుద్ధవాతావరణం వేడెక్కింది.

విజయనగరానికి చెందిన సైన్యాలు చిప్పాడ నుంచి పద్మనాభం వచ్చే రహదారిలో రేవిడి, కురపల్లి, తదితర ప్రాంతాలలో మొహరించాయి. గూడచారుల సమాచారం అందించగానే పద్మనాభం చేరుకోవడానికి వీలుగా గుర్రాలను ఏనుగులను కూడా సిద్ధం చేసారు.

ఆ ప్రాంతాలలో ఉన్నవారు యుద్ధంలో ఆరితేరినవారు శత్రువుపై ఎలాంటి సమయంలో లంఘించాలి వారి శతఘ్నులను ఎలా నాశనం చేయాలన్న విషయాలలో చాలా అనుభవం ఉన్నవారు కావడంతో విజయరామరాజుకు మద్దతుగా వచ్చిన చాలామంది రాజులు ధైర్యంగా ఉన్నారు. మళ్ళీ మహరాజుకు విజయనగర్మ కోట స్వాధీనం అవుతుందన్న విశ్వాసం వారిలో కనిపిస్తోంది.

అయితే విజయరామరాజులో ఒకలాంటి నిర్లిప్తత ఆవరించినట్లుగా అనిపిస్తోంది.

విజయం సాధ్యం అవుతుందా. లేదా రాజులందరికి వీర మరణం ప్రాప్తిస్తుందా అని మనసు పరిపరివిధాలుగా పోతోంది. తన కారణంగా అంతమంది రాజులు బలిదానం కావాలా అని కూడా అనిపిస్తోంది.

వాతావరణం యుద్ధం వరకూ వచ్చింది బ్రిటిష్ అధికారులు సైన్యాన్ని కూడా సిద్ధం చేసారు. అంటే వారు తన పట్ల సానుకూలత చూపించే అవకాశం లేనట్లే అనిపించింది కంపెనీ అధికారుల వైఖరిలో ఎందుకు మార్పురాలేదో విజయరామరాజుకు అర్థంకాని విషయంగా ఉండిపోయింది.

**ఫెండర్ గాస్టు ఉత్సాహం.**

మద్రాసు తర్వాత ఓడరేవు ప్రాంతంగా ఉన్న విశాఖపట్నానికి చీఫ్‌గా ఉన్న అధికారి తర్వాత కల్నల్ పెండర్ గాస్టు తనపై అధికారుల ఆదేశాలను అమలు చేయడం యుద్ధవ్యూహాలను తయారుచేయడం వంటి పనులు చేసే అధికారిగా ఉండేవాడు. అతను మద్రాసు అధికారుల ఆదేశాలను అమలు చేయడం విశాఖ పరిసర ప్రాంతాలలో ఉన్న చిన్న రాజ్యాలపై పెత్తనాలను చెలాయించడం, మాట వినని వారిని లొంగదీసుకోవడం వంటి పనులు చేసేవాడు. వారికి చెందిన సంస్థానాల నుంచి పేష్కను పేరుతో పన్నులను వసూలు చేయడం వంటి పనులు చేసేవాడు.

తనకు లభించిన అవకాశాన్ని అతను బాగా వినియోగించుకున్నాడు.

విజయరామరాజును విజయనగరం పరిసర ప్రాంతాలనుంచి పంపించడానికి తాను నియమించబడిన అధికారిగా అతను భావించడం వల్ల ఆ విషయాలను ప్రత్యేకంగా తీసుకున్నాడు.

కల్నల్‌గా యుద్ధతంత్రాలు తెలిసిన వ్యక్తిగా ఫెండర్ గాస్టుకు మంచి పేరు ఉంది. అందుకే విజయరామరాజు వ్యవహారాన్ని పరిష్కరించమని మద్రాసు కంపెనీ అధికారులు అతనికి బాధ్యతను అప్పగించారు.

బ్రిటిష్ అధికారుల ఆదేశాలను దిక్కరించిన విజయరామరాజుపై అతనికి పీకలవరకు కోపంగా ఉంది. బందీగా పట్టుకుని బలవంతంగా మద్రాసు తరలించాలని అనుకున్నాడు అలా అయితే ఎప్పటికైనా విజయరామరాజు నుంచి బ్రిటిష్ కంపెనీకి ముప్పు సంభవిస్తుందని అందువల్ల అతడిని యుద్ధంలో సంహరిస్తేనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని మనసులో అనుకున్నాడు. విజయరామరాజు అతని ముఖ్య అనుచరులు ఉంటే కళింగాంధ్రలో కంపెనీ పరిపాలన సుస్థితం చేసుకోవడం సాధ్యం కాదు. అందువల్ల రాజుని నిర్మూలిస్తేనే చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భావించాడు.

అందుకు అనుగుణంగానే తన వ్యూహాన్ని తయారు చేసుకున్నాడు.

అప్పటికే మద్రాసులో ఉన్న ఫిరంగులకు ఇతర యుద్ధ సామగ్రికి విశాఖపట్నం రప్పించాడు. రెండు పటాలాల సైనికుల్ని భీమిలి పంపించాడు. అక్కడినుంచి ఏ అర్ధరాత్రి అయినా యుద్ధభూమికి చేరుకునేలా వారికి సమాచారం అందించడానికి ఏర్పాట్లు చేసాడు.

మరికొంతమందిని బోని సమీపంలో ఉన్న మెట్ట ప్రాంతానికి తరలించాడు

పద్మనాభంలో విడిది చేసిన విజయనగర రాజుల కదలికలను తెలుసుకోవడానికి దూందర్శినులను కూడా రప్పించాడు.

శత్రువుని బలహీనుడిగా చేయడానికి కూడా ప్రయత్నాలు ప్రారంభించాడు.

బ్రిటిష్ సైనికులు ఆ ప్రాంతంలో చేస్తున్న మొదటి పోరాటంగా భావించడంవల్ల ఎలాగైనా గెలుపుని సాధించవలసిన అవసరం ఉంది. అంతేకాకుండా కల్నల్‌గా తన అనుభవాలపైన తనపైన అధికారులు ఎంతో నమ్మకాన్ని పెట్టుకున్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టవలసిన అవసరం కూడా తనపై ఉందని ఆయన భావించాడు.

విజయనగరం సంస్థానంలో ఉన్న సైనికాధికారుల వివరాలను రహస్యంగా సేకరించాడు వారి కదలికలు వారి పరిచయాలను కూడా కనిపెట్టాడు.

అందులో దావూద్‌ఖాన్ ఒక విభాగానికి నాయకుడు.

దావూద్‌ఖాన్‌ను సంప్రదించడానికి కొంతమంది సిబ్బంది చురుగ్గా పనిచేసారు.

విజయనగరం కోటను బ్రిటిష్ సైనికుల స్వాధీనం చేసుకున్న తర్వాత దావూద్ ఖాన్ విశాఖలో ఉన్న బ్రిటిష్ కంపెనీ అధికారులకు అందుబాటులో ఉన్నాడు. వారిలో ముఖ్యులతో మంచి సంబంధాలు కలిగి ఉన్నాడు.

ఈ పరిచయాలు కల్నల్ ఫెండర్ గాస్టుకు ఎంతో ఉపయోగపడ్డాయి. తనకు అనుకూలంగా పనిచేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు.

ఈ వ్యవహారంలో కల్నల్ తెలివితేటలు ఎంతో ఉపయోగపడ్డాయి.

**యుద్ధమేఘాలు**

1794 జూలై 9 చీకటి పడింది.

ఆషాఢ శుద్ధ చతుర్దసి.

ఆకాశంలో వెన్నెల పుచ్చపువ్వులా ఉంది.

బ్రిటిష్ అధికారులు విజయరామరాజుకు ఇచ్చిన గడువు ఆ రోజుతో పూర్తి అయిపోయింది. యుద్ధాన్నో మద్రాసు ప్రయాణాన్నో తేల్చుకోమని చెప్పిన విషయం ఇరువర్గాలలో గుర్తుంది.

ఆ రోజు రాత్రి వరకు పెండర్‌గాస్టు నుంచి తనకు సమాధానం వస్తుందని విజయరామరాజు ఎదురు చూసాడు. బోని సమీపంలో బ్రిటిష్ సైన్యాలు మోహరించి ఉన్నప్పటికీ తన విషయంలో అధికారులు సానుకూలత ప్రదర్శిస్తారని అతనికి అనిపిస్తూనే ఉంది.

రాత్రి పదిగంటలవరకు ఎటువంటి సమాధానం రాలేదు.

పద్మనాభం గ్రామాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాలలో సైన్యాలు ఇతర యుద్ధసామగ్రి అంతా సిద్ధంగా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రాజులకు ఎవరికీ నిద్రలేదు. అందరూ వెన్నెల రాత్రిలో విశ్రమించి ఉన్నారు. కొంతమంది దండనాయకులు సైన్యాన్ని అప్రమత్తం చేసే పనిలో ఉన్నారు.

రాత్రి ఒంటిగంట దాటిన తర్వాత చిన్న కదలిక వచ్చింది.

గోస్తనీ నది ఆవలతీరంలో బోని సమీపంలో ఉన్న బ్రిటిష్ సైనికులకు విజయనగర సైన్యం కదలికలు వెన్నెలలో కనిపిస్తూనే ఉన్నాయి. ఏమరుపాటుగా ఉన్న సమయంలోనే సైన్యంపై దాడి చేయాలన్నది బ్రిటిష్ వ్యూహం.

అందుకు అనుగుణంగానే ఆదేశాలు జారీ చేయబడ్డాయి.

బోని సమీపంలో చిన్న పాయగా ప్రవహిస్తున్న గోస్తనీ నదిలో బ్రిటిష్ సైన్యం దిగింది. సైనిక దళాలు పద్మనాభం కృష్ణాపురం గ్రామాల వైపు బయలుదేరాయి.

విషయం వేగుల ద్వారా విజయరామరాజుకు చేరింది.

యుద్ధం వస్తుందన్న విషయం తెలుసు. అంత తొందరగా వస్తుందని అతను ఊహించలేదు. మనసంతా అల్లకల్లోలం అయిపోయింది. పద్మనాభంలో తన కోసం వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన రాజులు గుడారాలలో విశ్రమించి ఉన్నారు. కొంతమంది సమీపంలో ఉన్న తోటల్లో పిచ్చాపాటిగా మాట్లాడుకుంటున్నారు. కొద్ది గంటలలో సైనికులు తమపై దాడి చేయడానికి వస్తున్నారన్న విషయం తెలియడంతో విజయరామరాజుకు మనసంతా కకావికలం అయిపోయింది.

తన రాజ్యం కోసం ఇంతమందిని బలిదానం చేయాలా అనిపించింది. వెంటనే తన పక్కన ఉన్న సైనికుడ్ని పిలిపించి అతనికి తన గుర్తింపుగా జరీ అంచు అంగీని అందించి – తక్షణమే కల్నల్ ఫెండర్ గాస్టు దగ్గరికి వెళ్ళి తాను బ్రిటిష్ అధికారుల ఆదేశాలకు కట్టుబడి ఉన్నానని ఇటువంటి పరిస్థితుల్లో తనపై దాడిచేయడం సరికాదని చెప్పి రమ్మని పంపించాడు.

ఆ సైనికుడు తొందర తొందరగా బోని మెట్టవద్ద ఉన్న బ్రిటిష్ సైనిక శిబిరం వైపు కదిలిపోయాడు.

సైనికుడితో తాను పంపిన సమాచారానికి ఫలితం ఉంటుందని విజయరామరాజులో ఆశ మినుకుమినుకు మంటోంది. మనిషి స్థిమితంగా ఒక దగ్గర కూర్చోలేకపోతున్నాడు.

చంద్రోదయం పూర్తిగా జరిగిపోయింది.

చంద్రుడు అస్తమిస్తున్న పరిస్థితులవల్ల ఆరోజు పూర్తి అయిపోయినట్టు రాజుకు సిబ్బంది సమాచారం అందించారు.

జూలై పదవ తేదీ ప్రవేశించింది.

జంపన అప్పలరాజు పూసపాటి వెంకటపతిరాజులు పరుగు పరుగున వచ్చారు.

"ఏమిటి?" అన్నట్టు విజయరామరాజు చూసాడు.

అతని చుట్టూ అప్పటికే రెండువందలమందికి పైబడిన రాజులు ఉన్నారు. వారంతా కత్తులు, కటార్లు, బల్లాలు వంటివి పట్టుకున్నారు. కొంతమంది నాటు తుపాకులు చిన్నసైజు ఫిరంగులు పట్టుకుని యుద్ధరంగంలోకి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారు.

"మహారాజా శత్రుసేనలు పద్మనాభం వైపు వస్తున్నాయి" వెంకటపతిరాజు.

"ఫిరంగులకు అవసరమైన మందు గుండును తీసుకుని వస్తున్నట్లు సమాచారం ఉంది" అప్పలరాజు రొప్పుతూ చెప్పాడు.

ఆ మాటలు విని రాజులంతా అప్రమత్తం అయ్యారు.

"శత్రువులు మన దగ్గరకు వచ్చిన తర్వాతే మనం ఎదిరించే కన్నా వారుగోస్తనీ నది దాటకముందే వారిపై దాడి చేయడం మనకు శ్రేయస్కరం. మహారాజుగారు అనుమతి ఇవ్వాలి" సత్తిరాజు ఆవేశంతో అడిగాడు."తమ కోసం వచ్చిన మల్లయోధులు కూడా యుద్ధరంగానికి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారు. వారికి అవకాశం కల్పిస్తే బ్రిటిష్ ముష్కరుల్ని గోస్తనీలోనే పాతర వేస్తారు" రాఘవరాజు అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యుద్ధవీరులు, సామంత రాజులు వారికి వంతపాడారు.

విజయరామరాజు వారిని వారిస్తూ "మనం సైనికుడితో కల్నల్‌కు కబురు పంపాం. దానికి ఆయన స్పందన ఎలా ఉందో తెలియదు. అది తెలుసుకోకుండా మనమే ముందుగా దాడి చేస్తే రెచ్చగొట్టినవారం అవుతాం. కాస్త ఓపిక పట్టండి" అని చెబుతూ పక్కనున్న తన అనుచరులతో "పల్లకిని సిద్దం చేయించండి" అంటూ గుడారంలోకి వెళ్ళిపోయాడు.

పల్లకి గుడారం ముందుకు వచ్చింది.

నలుగురు బోయిలు కూడా తయారైపోయి వచ్చారు.

లోపలినుంచి విజయరామరాజు తలకు ఎర్రని రుమాలు కట్టుకుని బైటికి వచ్చాడు. ఆయనకు సహాయకంగా పదుల సంఖ్యలో రాజులు కూడా తయారయ్యారు.

ఎక్కడికో ఏమిటో తెలియకుండా పల్లకీ బయలుదేరింది.

గుడి సమీపంలో ఉన్న చెరువు దగ్గర ఆపమంటే బోయిలు పల్లకీని ఆపారు.

ఒక సైనికుడు అందించిన వేపపుల్లతో విజయరామరాజు దంతావదానం చేసుకున్నాడు. మొహం కడుక్కోవడానికి సిబ్బంది చెంబుతో నీళ్ళు అందించాడు.

విజయరామరాజు ఉన్న చెరువుకు కూతవేటు దూరంలోనే బ్రిటిష్ వారితో యుద్ధం చేయడానికి వీలుగా విజయనగర సైనికులు సిద్ధంగా ఉన్నారు. వారిని రెండు విభాగాలుగా చేసి ఒక దానికి పూసపాటి విజయగోపాలరాజు, మరో దానికి హుస్సేన్ బేగ్‌లు నాయకత్వం వహిస్తున్నారు. వారి పరిధిలో సైనిక బృందాలు యుద్ధరంగంలోకి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాయి.

బ్రిటిష్ సైనికులు గోస్తనీ నది దాటి ముందుకు వచ్చారు.

వారికి విజయనగరం సైన్యం ఎక్కడ ఉందన్న విషయం ఖచ్చితంగా తెలియడంలేదు. పద్మనాభం కృష్ణాపురం గ్రామాల సరిహద్దులో వారంతా భారీ వ్యూహంతో యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. శత్రువు ముందుకు వస్తే వారి పైన నలువైపుల నుంచి ఉక్కిరి

బిక్కిరి చేసే విధంగా దాడి చేయడానికి సిద్దంగా ఉన్నారు. విజయనగరం రాజుల వ్యూహం ప్రకారం వారే ముందుగా దాడి చేయాలని అనుకున్నారు. దూరంగా గోస్తనీ తీరంలో ఉన్న శత్రు సైనికుల పైకి గుర్రాలతో ఇతర సైన్యంతో అమిత వేగంతో దాడి చేసి వారందర్నీ చిందరవందరగా చేయడంద్వారా వారి పిరంగులను, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకోవాలని అనుకున్నారు. కానీ విజయరామరాజు దీనికి అంగీకరించలేదు. మనంతట మనం ముందుగా దాడి చేయకూడదని అందర్నీ ఆదేశించాడు.

ఆ సమీపంలోనే దావూద్ ఖాన్ కూడా సైన్యంతో యుద్దానికి రడీగా ఉన్నాడు.

విజయరామరాజు తరపున సైన్యాన్ని సిద్దంచేసినప్పటికీ అప్పటికే కల్నల్ ఫెండర్‌గాస్టుతో అతనికి ఒప్పందం కుదరవడంతో బ్రిటిష్ వారికి తమ సైనికుల సమాచారాన్ని అందించవలసిన అవసరం ఉందని అనిపించింది.

అందుకు అనుగుణంగా తన వద్ద ఉన్న తుపాకితో మూడుసార్లు ఆకాశంలోకి కాల్పులు జరిపాడు. అలా జరపడంతో పాటు తన సైనికులను తీసుకుని ముందుకు కదిలాడు. అతను శత్రువుపైకి దాడి చేయాలన్న ఉద్దేశ్యంతోనే ఆవిధంగా చేసాడని అక్కడున్న సైనికులు అనుకున్నారు. అందుకు అనుగుణంగా చెదిరిపోయారు.

అయితే అది బ్రిటిష్ సిబ్బందికి ఎంతో ఉపకరించింది.

విజయగోపాలరాజు, దావూద్ ఖానుల అనే సైనికాధికారుల ఆధ్వర్యంలో ఉన్న రెండు సైనిక దళాలు బ్రిటిష్ సైనికులకు బహిర్కృతం అయ్యాయి. ఇది ముందుగా అనుకున్న వ్యూహం అక్కడున్న వారు తెలుసుకోలేకపోయారు.

ఆ సమీపంలోనే చెరువు దగ్గర ఉన్న విజయరామరాజు కూడా యుద్ధభూమిలోకి అడుగుపెట్టాడు. శత్రువులు తుపాకులు కాల్చకుండా వారిపై దాడిచేయవద్దని విజయరామరాజు ఆదేశం కానీ పేలిన తుపాకీ ఎవరిదన్న విషయం ఎవరికీ అర్థం కాలేదు. అందువల్ల విజయనగరం సైనికులు బ్రిటిష్ సైనికులు పరస్పరం తలపడేలా చేసింది. ఫిరంగులు వరుసగా పేర్చి ఎప్పుడు కాలుద్దామా అని బ్రిటిష్ సైనికులు సిద్దంగా ఉన్నారు. అందుకు తగిన విధంగా ఏర్పాట్లు కూడా వారు చేసుకున్నారు.

హుస్సేన్ బేగ్ నాయకత్వంలో ఉన్న దళం శత్రు సైనికుల మరఫిరంగిలను స్వాధీనం చేసుకోవడానికి వారిని చుట్టుముట్టడానికి ప్రయత్నించింది. వారితో కొంతమంది సామంతరాజులు కూడా ముందుకు కదిలారు.

వారు తమ గురి పరిధిలోకి రాగనే సిద్ధంగా ఉన్న బ్రిటిష్ సైనికులు ఒక్కసారి ఫిరంగి గుళ్ళవర్షం కురిపించారు.

ముఖ్యులంతా ఒక్క పెట్టున నేలరాలిపోయారు.

యుద్ధభూమిలో హాహాకారాలు మిన్నంటిపోయాయి.

అరుపులు కేకలతో ఆ ప్రాంతమంతా అల్లకల్లోకంగా తయారైంది.

విజయరామరాజు తన అనుచరులతో యుద్ధరంగంలోకి దూకాడు.

తూర్పు తెలవారుతోంది.

విజయరామరాజు యుద్ధరంగంలో తన సిబ్బందితో పోరాటానికి సిద్దమయ్యాడు. అతడిని అనుసరించి వివిధప్రాంతాల నుంచి విచ్చేసిన రాజులు ముందుకు కదిలారు. వారి చుట్టూ గుర్రాలపై అశ్విక దళం ఒక పక్క ఉంది. మరోపక్క యుద్ద కళల్లో ఆరితేరి ఉన్న సర్దార్లు ఉన్నారు.

బ్రిటిష్ సైనికులు వారిపై ఫిరంగి గుళ్ళ వర్షం కురిపించారు.

యుద్ధవీరులు ఒకొక్కరు నేలకు ఒరిగిపోతున్నారు.

జంపన వెంకటరాజు, దాట్ల చినవెంకటపతిరాజు, చింతలపాటి నీలాద్రిరాజు, భూపతిరాజు తిరుమల రాజు, పొత్తూరు రాఘువరాజు, పూసపాటి విజయగోపాలరాజు, తిరుమల రాజు కొండ్రాజు, దంతులూరి అప్పలరాజు, గణపతిరాజు నర్సింహరాజు, నడింపల్లి రామభద్రరాజు, వత్సవాయి నరసరాజు, సాగి సన్యాసిరాజు, కాకర్లపూడి కొండరాజు, మందపాటి పద్మనాభరాజు తదితర రాజులంతా నేలకు ఒరిగిపోయారు. వారితోపాటు మరో ముప్పయిమంది ప్రముఖులు కూడా ప్రాణ త్యాగం చేసారు.

వారి మధ్యలో ఉన్న విజయరామరాజులో ఆవేశం కట్టలు తెంచుకుంది.

ఎదురుగా బ్రిటిష్ సైన్యాలు మోహరించి ఉన్నాయి.

తనకోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి యుద్ధరంగంలోకి వచ్చి విగతజీవులుగా మారిన వీరుల మృతదేహాలను చూస్తుంటే సీతారామరాజు మనసు విలవిల్లాడిపోయింది.

శత్రు మూకల్ని సంహరించడానికి ముందుకురికాడు.

అతనికోసమే వేచి చూస్తున్న సైన్యాలు రాజువైపు గురిపెట్టాయి.

గుండెల్లో దిగిన గుళ్ళకు రక్తం ఎగజిమ్మింది

మాతృభూమికి ప్రణమిల్లుతూ విజయరామరాజు నేలకు ఒరిగిపోయాడు.

రాజుల శవాల గుట్టల మధ్య విజయనగర సంస్థానాధీశుడు విగతజీవునిగా అయిపోయాడు. ఒక చెయ్యి గుండెలపైనా మరో చెయ్యి నడుంకు తగిలించిన కత్తిపైన ఉంచుతూ మరణశయ్యను ఆశ్రయించాడు.




గోస్తనీనది సమీపంలో యుద్ధక్షేత్రం

పద్నాలుగు ఎకరాల్లో విస్తరించి ఉన్న స్థలంలో విజయరామరాజు మృతదేహం మధ్యలో ఉంది. అతని చుట్టూ నలభైమంది యుద్ధవీరులుగా వచ్చిన రాజుల మృతదేహాలు గుట్టలుగుట్టలుగా పడి ఉన్నాయి. ఆ సమీపంలో చనిపోయిన మరో 208 మంది రాచవీరులు, యుద్ధంలో చనిపోయిన సైనికుల శవాలు చెల్లాచెదురుగా ఉన్నాయి.

తెగిపడిన చేతులు, మానవ అవయవాలు చిందరవందరగా ఉన్నాయి.

రక్తం ప్రవహించి గడ్డకట్టుకునిపోయి ఉంది.

యుద్ధ వీరుల కత్తులు కటార్లు, ఇతర యుద్ద సామగ్రి ఆ ప్రాంతమంతా విస్తరించిపోయి ఉన్నాయి. వారి తలపాగాలు ఇతర దుస్తులు రక్తం మరకలతో నిండిపోయాయి.

రుధిర సంగ్రామం జరిగిన గుర్తులు అక్కడంతా విస్తరించి ఉన్నాయి.

విజయనగర సంస్థానాన్ని స్వాధీనం చేసుకోవడానికి తమ మాట వినని రాజుని తుదముట్టించామన్న సంతృప్తితో అంతవరకు అక్కడే ఉన్న బ్రిటిష్ మూకలు బోని మెట్టవైపు తరలిపోయాయి.

అస్తమించిన రాజులు మళ్ళీ ఉదయిస్తారన్న గుర్తుగా సూర్యకిరణాలు వస్తున్నాయి.

గోస్తనీ వెనుక నుంచి సూర్యోదయం అయింది.

**(సమాప్తం)**

Post your comments